


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -162-

(18 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**పాతకాలపు పద్ధతులు** చప్పగా అదృశ్యమవుతున్నా ఇంక అక్కడా అక్కడా వాటిని గురించి తహతహలాడేవారు కొందరు లేకపోలేదు.

మొన్న హైదరాబాద్‌లో రాఘవేంద్ర అనే కన్నడ విద్యార్థిని అడిగాను "నీకెలాటి భార్య కావాలని వుంది?" అని అతడు నిమిషం కూడా ఆలోచించకుండా "నన్ను దైవంలాగా కొలుచుకునే భార్య" అన్నాడు.

"నీలో చాలా స్వార్థం వుందే?" అన్నాను.

"ఏం వుంది నేను ఆశకుపోయి ఏమీ అడగలేదా?" అన్నాడు.

"స్వార్థం కాదుటయ్యా! నిన్ను భార్య దైవంలాగా కొలవాలి అనుకుంటున్నావుగాని నీలో అలాటి శక్తి వుండాలనుకుంటున్నావా? అలా ఉన్నప్పుడు వారు కొంపకి ఏం చేస్తారు? కనుక నువ్వు ముందా శక్తి సంపాదించడం అవసరమంటావా లేదా?" అని దబాయించాను.

పాపమా కుర్రవాడు "మీరు చెప్పింది నిజమే. అలాటి శక్తి సంపాదించాలి నేను" అన్నాడు.

పాపం అతగాడికి పూర్వ సాంప్రదాయాలు బాగా తెలియవు అందువల్ల అలా ఒప్పుకున్నాడు. మన పూర్వీకులు చెపుతారు "భర్త మోడర్న్, కోపిష్టి అయినా, రోగి అయినా అతణ్ణి దైవముగా పూజించవలసిందే" అని.

ఆ విధంగానే ఆమె పాత్రివ్రత్యం నిలుస్తుందన్నారు. ఆ విధంగానే ఆమె స్త్రీలకు తలమానికం అవుతుందన్నారు. అలాటి స్త్రీ శక్తికి తిరుగులేదన్నారు.

పైన చెప్పిన కుర్రవాడు ఇవన్నీ గ్రహించకపోవడంవల్ల చప్పున వప్పుకున్నాడు. తను ముందుగా అర్హత సంపాదించాలనే విషయం లేకపోతే పై పాఠమంతా గ్రుక్క తిరక్కుండా అప్పగించేవాడే.

పూర్వం మగవాడు దైవంగా పూజింపబడటానికి, అభం శుభం ఎరగని ఒక పిల్లమెళ్ళో మూడుముళ్ళు వేస్తే సరిపోయేది. వెంటనే ఆయనలో భగవదాంశ మేల్కొనేది భార్య ఒక్కర్తే విషయంలోనే అనుకోండి. చాలదూ ఆ హోదా! పది అవతారాలెత్తకుండా ఒక్క అవతారంలోనే అతను ప్రదర్శించేవారు.

ఆనాటి అమాయక స్త్రీలు ఎక్కడో వ్రాసి ముక్కలు, ఎవరో చెప్పిన వాక్కులూ విని భర్తలని ఆ అపరభగవంతుని సేవలో మునిగి ముచ్చట పడుతూ వుండేవారు. అసలాయన గుణంకాలగురించి ఆలోచించడానికి గాని, విచారించడానికి, అవకాశం వుండెదేకాదు. పతిసేవా పరాయణత్వంలో గతి తప్పిపడివుంటూనే ప్రీతి చెందేవారు.

రాను రాను కాలం మారింది శుష్క పూజలు, సూర్యార్చనలు చేయడానికి చాలామంది వప్పుకోవడంలేదు 'అర్హత సంపాదించుకో – ఆ తర్వాత ఆలోచిద్దాం' అంటున్నారు.

ఒకవేల పతికి పాత పాఠాలు ఆ విధంగా కోరినా ప్రయోజనాలుండటంలేదు "నావల్లకాదు" అని స్పష్టంగా చెపుతున్నారు. ఇలాటి భర్తే ఒకాయన భార్య రాగానే చెప్పాడుట "నువ్వు ప్రతి రోజూ ఇంటికి రాగానే నా పాదాలకు నమస్కరించాలి" అని.

ఆమె వెంటనే అందిట "నాకు నడుం వంగదు నావల్ల కాదా నమస్కారాలు. కావాలంటే తలుపు తీయగానే ఒక చిరునవ్వు విసురుతాను అంతే గాని నేను నడుం విరగ్గొట్టుకోలేను. అసలే సన్నం" అందిట.

"భర్తకు కోపం వచ్చి అలా అంటే కుదరదు కాళ్ళు కడిగి నీళ్ళు నెత్తినజల్లుకోవాలి మూడుపూటలా" అన్నాడుట.

ఆవిడ అందిట "ఇంకా నయం చన్నీళ్ళు మూడు పూటలా నెత్తిన జల్లుకొంటే జలుబు పట్టుకురాదూ బాగుంది మీ ప్రేమ. ఏ నిమోనియలోకో దింపితే ఎంత కష్టం? అప్పుడు మీరు చేస్తారా చాకిరీ. ఏమీ వద్దులెండి" అందిట.

"ప్రతిదీ వద్దు వద్దంటావేం ఆ నవలలు అవతల పారేసి పతివ్రతల కథలు చదువు బుద్ధి వస్తుంది. ప్రతి రాత్రి కాళ్ళు పిసికి అన్ను నిద్రబుచ్చాలి అందులో ఎంతో పుణ్యం వుంది తెలుసా?" అన్నాడుట భర్త.

"ఇంకానయం కాళ్ళు పిసగడమేమిటి? నొప్పులుగా వుంటే నొవోల్జిన్ వేసుకోండి. అప్పటికీ నిద్రపట్టకపోతే ఫాను గాలి పెంచుతాను. అప్పటికీ నిద్రపట్టకపోతే ఒక్క నిద్రమాత్ర చాలు అంతేగాని, కాళ్ళు పిసకడమేమిటి? బాడ్ హాబిట్" అన్నదిట ఆ లలనామణి.

నిజమే ఒక విధంగా ఆలోచిస్తే స్త్రీలు అలా జవాబు చెప్పటంలో కొంత న్యాయం వుందనిపిస్తోంది. పాపం వాళ్ళను కేవలం బానిసలుగా భావించి "ఇలా చేస్తావా చేయవా?" అని ధిక్కరిస్తే ఏం చేస్తారు? "నీకు దిక్కున్నచోట చెప్పుకోవయ్యా ఇన్ని మొక్కులు నేనెక్కడ చెల్లించగలను? మేమేం యంత్రాలంకాదు" అనడందాకా వస్తుంది.

అనిపించుకున్న తర్వాత చేయగలిగిందేం వుంది. చింతాక్రాంతులు కావడం తప్ప, కాలం మారింది గనుక ఆచారాలు కూడా మారడం తప్పదు. వెనుకటి పద్ధతిలో వుండమంటే ఎలా?

మొన్న ఒకాయన అన్నాడు "ఇంకా నయం పనులు చేసినా చెయ్యకపోయినా భర్తను కొలిచినా, కొలవకపోయినా చాలామంది, ఇళ్ళల్లో వుంటున్నారు. బయటకి కలిసి మెలిసి కాపురం చేస్తున్నట్లే కనిపిస్తుంది. కొంతమంది పొరుగూళ్ళలో ఉద్యోగాలు చేస్తున్నారు.కొందరు పుట్టిళ్ళల్లోనేవుండి, బుద్ధి పుట్టినప్పుడు వచ్చి చూచి చక్కా పోతున్నారు. ఇలాటివారు ఇంచుమించుగా విజిటింగ్ ప్రొఫెసర్ల కిందా సినిమాభాషలో అయితే "గెస్టు ఆర్టిస్టుల" క్రిందా జమ వేసుకోవాలసి వస్తోంది. "

పూర్వపద్ధతిలో బండచాకిరీచెయ్యడము సాధ్యమా ఈ కాలంలో. ఆ కాలంలో భర్త భోజనం చేయందే భార్య చెయ్యకూడదని నియమం ఆయనగారు వచ్చి తినేలోగా తూలిపోతూ పడిపోతూవుండేవారు.

ఇప్పుడెక్కడ వుండగలరు? ఇప్పుడా లంబోదర పూజలు సన్నగిల్లాయి పదిన్నరకు వచ్చి భోజనం చెయ్యకపోతే తనపని తాను కానిచ్చి, వచ్చి సోఫాలో కూర్చోవడమే బుద్ధిమంతుడేనా, నాలుగు వస్తువులూ ఒకచోట పెట్టి మూత పెట్టి వస్తున్నారు అలా కాని వారు భర్త రాగానే వంటింటిని వేలుతో చూపిస్తున్నారు.

భార్య ముందర తిన్నదని గ్రహించి ముసి ముసి నవ్వులు నవ్వుతూ, అంతా వెతుక్కుని తొందరగా వంటింట్లో ప్రవేశిస్తున్నారు పురుషోత్తములు. చాలామంది మారు వడ్డనక్కూడా పిలిచే ధైర్యం వుండటంలేదు.

తినేసాక "నేతిగిన్నె మూతపెట్టారా? మజ్జిగ కూరగిన్నె, అన్నం గిన్నె పళ్ళెంలో బోర్లించారా? అలమరా తలుపు వేశారా? దొడ్డి తలుపు?" ఇలాంటి ప్రశ్నలకు జవాబు చెప్పడం తప్పదు పాపం.

పూర్వాచారాలు ఎగిరిపోతున్నాయి. ఏరోజుకారోజు ఏవైనా కొన్ని వున్నా అవి బూజు క్రింద వ్రేలాడుతున్నాయి వాటి వివరాలు మరోసారి.

Post your comments